# నేనూ: యాక్సిడెంటూ


రోజూ లాగానే ఆఫీసు కెళ్దామని బస్సుస్టాండు కొచ్చాను. అక్కడి దృశ్యం చూస్తే నాకు చాలా ఆశ్చర్యం ఆనందం వేసింది.

ఎందుకంటే బస్సుస్టాండులో అస్సలు జనం లేరు. రోజూ జనాన్ని తోసుకుని బస్సు ఎక్కాల్సి వచ్చేది.

నేను బస్సు స్టాండులో నించున్నాను అయిదు...పది....పదిహేను నిమిషాలైంది. ఒక్క బస్సుకూడా రాలేదు.

అప్పుడు గమనించాను....

జనం రోడ్లమీంచి గుంపులు గుంపులుగా నడుచుకుంటూ వెళ్ళిపోతున్నారు.




నాకు అనుమానం వచ్చింది. రోడ్డుమీద వెళ్ళే ఒకతన్ని ఆపాను.

ఆర్టీసీ స్ట్రయికుకదా ఈవేళ అన్నాడు.

నేను పనిచేసే ఆఫీసు చాలాదూరం. బస్సులు లేవు ... అంతదూరం నడిచి వెళ్ళడం కష్టం. అందుకని ఆటోని పిలిచాను. వాడు

"మనిషికి అయిదు రూపాయలివ్వాలి" అన్నాడు.

"నేను ఒక్కడినేకదా? ... మనిషికి అయిదు రూపాయలంటావేం?..." అన్నాను.

"అర్రె....గదేంమాట !... గిప్పుడు ఒక్కడివే ఉన్నవ్ ... జర్ర సేపైతే వేరోళ్లు రారా...ఆళ్ళను బీ ఎక్కించుకుంటా...." అన్నాడు వాడు రుస రుస చూస్తూ.

అంటే నాతోబాటు మరో ఇద్దర్ని ఎక్కించుకుంటానన్నమాట ... ముగ్గురికీ మూడైదులు పదిహేను రూపాయలా?... మీటరేస్తే నాలూపాయలే కదయ్యా అవుతుంది." అన్నాను గుండెలమీద చెయ్యేస్కుంటూ.

"అర్రె ఇస్కీ...గట్ల గుండెల్మీద చెయ్యేసుడేంది...గట్లపరేషానైతే సుప్పేం ఆటో ఎక్కుతావ్ సాబ్!..." అన్నాడు.

మల్లిక్

ఇంకా ఏమైనా మాట్లాడితే నా పరువు తీస్తాడని ఆటో ఎక్కి కూర్చున్నా. వాడు మాత్రం మిగతా రెండు బేరాలు తగిలే దాకా కదల్లేదు. మిగతా యిద్దరూ దొరకడానికి పదిహేను నిమిషాలు పట్టింది. అప్పుడు కదిలింది ఆటో.

ఆఫీసుకు వెళ్ళేటప్పటికి బాగా ఆలస్యం అయిపోయింది. మా ఆఫీసరు నాకు బాగా చివాట్లు పెట్టాడు.

ఆర్.టి.సి. వాళ్ళ స్ట్రయికు వారం రోజులు జరిగింది. కండక్టర్లు టిక్కెట్టు కొట్టకుండా డబ్బులు తిన్నా ఏమనకూడదు ... చెకింగులు చెయ్యకూడదనిట స్ట్రయికు. చివరికి కండక్టర్లే గెలిచారు.

ఈ వారంరోజులు ఆఫీసుకు వెళ్ళడానికి చాలా బాధలు పడ్డాను. డబ్బులు ఖర్చు పెట్టడమే కాక ఆటోవాళ్ళతో నానా రకాలుగా బాధలు పడాల్సి వచ్చింది. బస్సులున్నా అంతే....అవి టైంకి రావు. వచ్చినా బస్సుస్టాపులో ఆగవు.

"ఇన్ని బాధలు పడేకంటే ఏ స్కూటరో మోటర్ సైకిలో కొనుక్కోరాదూ ?" అంటూ నా స్నేహితుడు చంద్రావు సలహా ఇచ్చాడు.

"నీ సలహా బాగుందిగానీ మరి డబ్బులో ?" అన్నాను.

"ఆఫీసులో లోనుపెట్టు .."

వాడి సలహా నచ్చింది.

మా ఆఫీసులో స్టాఫ్‌కి ఒకే ఒక రకం లోను ఇస్తారు. అది పర్సనల్ లోన్. దాన్ని పెళ్ళి చేసుకోడానికిగానీ, మీద ఆధారపడిన వాళ్ళ పెళ్ళిళ్ళు చేయడానికి గానీ, అంటే చెల్లెళ్ళ, కూతుళ్ళ పెళ్ళిళ్ళ అన్నమాట. దానికే ఇస్తారు.

ఆలోచన రాగానే దాన్ని ఆచరణలో పెట్టేశాను. లోను అప్లికేషను ఫారం పూర్తిచేసి శాంక్షన్ చేసినట్టు సంతకం పెట్టించుకోడానికని మా ఆఫీసరు గదిలోకి వెళ్ళాను. అప్లికేషన్ని ఆయన ముందుంచాను.

"ఏంటిది ?" అన్నాడాయన కళ్ళెగరేస్తూ.

నేను చెప్పాను.

"వాహ్వాట్ ! !...ఈ మధ్యనే కదా సువ్వొక మ్యారేజీలోను పెట్టావ్ ?" అన్నాడు.


"ఆ మ్యారేజీలోను మా చుట్టాలాయన ఎవరికో డబ్బు అవసరం అయి నన్ను సర్దమంటే పెట్టానండీ...."

మరి పోయిన సంవత్సరం కూడా ఒక మ్యారేజీలోను పెట్టినట్టున్నావ్ ?"

"ఆ మ్యారేజిలోను స్టీలు ఆలమరా. కుర్చీలు వగైరాలు కొనడానికి తీసుకున్నానండీ...."

"మరి ఈ మ్యారేజిలోను ?"

"ఈమ్యారేజీలోను స్కూటరు కొంటానికి పెట్టానండీ..." అన్నాను.



"వెరీసైన్...వెరీసైన్...అయితే ఇక ముందు ఆఫీసుకు ఆలస్యంగా రావన్న మాట...." అనేసి నా అప్లికేషనుమీద లోన్ శాంక్షన్ చేసినట్టు రాసి సంతకం చేసేసాడు.

లోను డబ్బు చేతికి అందింది.

చంద్రం, నేను కలిసి వెళ్ళి స్కూటర్ కొన్నాం. ఆరోజునుంచీ నా కష్టాలు గట్టెక్కాయ్...నేను రోజూ ఆఫీసుకి కరెక్ట్ టైంకే చేరుకుంటున్నాను. స్కూటర్‌మీద వెళ్తూ బస్సుస్టాండ్‌లో నిలబడ్డ జనాన్ని చూస్తుంటే నాకు జాలివేస్తుంది...ఆటో వాళ్ళని చూస్తే కసిగా నవ్వాలని అనిపిస్తోంది.

కానీ....

ఆ రోజు...

రాత్రి సెకండ్ షో సినిమాకి వెళ్ళడం వల్ల ఉదయం మెలకువ రాలేదు. చాలా ఆలస్యంగా నిద్ర లేచాను. టైం చూస్తే పదిన్నరైంది.

గబగబా భోజనంచేసి ఆఫీసుకిబయలు దేరా స్కూటర్‌మీద.

త్వరగా వెళ్ళాలి! కంగారు!!...

నా కర్మకాలి ట్రాఫిక్ సిగ్నల్ ఉన్న ప్రతిచోటా నేను వెళ్ళగానే రెడ్‌లైట్ పడుతోంది.

దాంతో మరింత హడావిడి పడిపోయాను.

స్కూటర్ స్పీడు పెంచాను. ఎక్కడి నుంచి వచ్చిందో హఠాత్తుగా ఓ ఎద్దు పక్కనున్న ఇరుకు సందులోంచి రివ్వున మెయిన్‌రోడ్డు మీదికి దూసుకు వచ్చి నా స్కూటర్‌కి అడ్డుపడింది. అప్పటికీ నేను బ్రేకు నొక్కానుగానీ ఒకటిన్నర క్షణాలు ఆలస్యం చేసినట్టున్నా...

క్రీ..........రో....... ష ....... ఢక్!

నా స్కూటర్ ఎద్దుని గుద్దుకుని ఆగిపోయింది కానీ నేనుమాత్రం ఆగలేదు. సూపర్ మ్యాన్‌లా రివ్వున గాల్లో పదిఅడుగులదూరం వెళ్ళి దబ్బున నేలమీద పడ్డాను. మోచేతులూ, మోకాళ్ళూ కొట్టుకుపోయాయ్. వాటిని చూసుకుందాం అనుకుంటుండగా రివ్వున ఒక లారీ నా మీదికి వచ్చెయ్యడం కనిపించింది.


వెంటనే నేను నేలమీద కూర్చునే కప్పలా పక్కకి గెంతాను. కానీఅట్నుండి ఆటో సర్రున దూసుకు వస్తోంది. మరోసారి కప్పలా ఇంకో వైపుకి గెంతాను. లారీ, ఆటో రెండూ వెళ్ళిపోయాయ్ రోడ్డుమీంచి లేచి కుంటుకుంటూ నాలుగ

---

ఇరవైయేళ్ళ యువకవితో పత్రికా సంపాదకుడు: "ఈ పద్యాలు మీరు రాసినవేనా?"


"అవును. అవి పూర్తిగా నేను రాసినవేనండి."

"నమస్కారం రాయప్రోలు సుబ్బారావుగారూ! మీకు ఎనభైఏళ్ల దాటయని ఎవరో అబద్ధం చెప్పారు నాతో." ●



దుగులు వేశానో లేదో కను కొసలనుండి ఇందాక నేను స్కూటర్‌తో గుద్దిన ఎద్దు నావైపు దూసుకు రావడం కనిపించింది. నేను కుంటుతున్నానన్న విషయం కూడా మర్చిపోయి పక్కకి ఒక్క జంపింగు చేశాను. ఎద్దు కూడా ఎంతో సమయ

స్ఫూర్తితో పక్కకి జంపింగు చేసి నన్ను పొడవబోయింది. నేను నడుం కాస్త వెనక్కి వొంచా... ఎద్దు సర్రున నా వెనక భాగాన్ని రాసుకుంటూ దూసుకు పోయింది. ఆ రాపిడికి నేను ఎగిరి బోర్లా పడ్డాను.



లేవాలని ప్రయత్నించానుగాని ఒక ఏనుగుని నావీపుమీద కూర్చోబెట్టినట్టు లేవ లేక పోయాను. ఆ దారిన పోయేవాళ్ళు నన్ను లేపి నిలబెట్టారు. ఓ సోడా కొట్టి నాకు తాగించారు. అందులో ఒకరు నన్ను దగ్గర్లోని ఆసుపత్రికి నా స్కూటర్‌మీదే తీసుకెళ్ళి నా చేతులకీ, ఒక కాలుకీ కట్లు కట్టించి, మొహానికో ప్లాసరు ప్లస్ ఆకారంలో అతికింపజేసి నన్ను స్కూటర్ వెనకాల మళ్ళీ కూర్చోబెట్టుకుని ఇంటి దగ్గర దింపి వెళ్ళిపోయాడు.

రాత్రికి జ్వరం వచ్చిందిగానీ డాక్టరు గారిచ్చిన మాత్ర వేసుకుని పడుకున్నాను. తెల్లారి ఆలస్యంగా లేచాను. జ్వరం తగ్గిందిగానీ ఒళ్ళంతా నొప్పులు కలవెం దుకు వేస్టు చెయ్యాలని ఆఫీసుకు బయలు దేరా. చేతులకీ, ఓ కాలుకీ కట్టుంది కాబట్టి స్కూటర్‌ని ఇంటిదగ్గరే వదిలేసి ఆఫీసుకి బస్సులో వెళ్ళాను.

ఆఫీసుకెళ్ళేసరికి అరగంట లేటైంది. అటెండెన్సు రిజిస్టరు లోపలికి వెళ్ళి పోయింది.

నేను కుంటుకుంటూ ఆఫీసరు గది లోకి వెళ్ళాను.

"ఆఫీసుకు లేటుగా వచ్చినందుకు ఈవేళేం కుంటిసాకు చెప్పదల్చు కున్నావ్?" అన్నాడు ఆఫీసరు కొర కొరా చూస్తూ.

నేను నా చేతులు చూపించాను.

"ఊ......హు!" అన్నాడతను.

తరువాత కాళ్లు చూపించాను.

ఓహో...." అన్నాడు కళ్ళెగుర వేస్తూ.

"స్కూటర్ యాక్సిడెంటయ్యిం దండి..." అన్నాను.

"ఏదీ చేతులిలా చాపు..."

నేను చేతులు ముందుకు చాపాను. అతను వాటిని కుక్కలా స్నిఫ్ చేస్తూ వాసన చూశాడు.

తరువాత సీట్లోంచి లేచి ఇవతలికి వచ్చి మోకాళ్ళమీద కూర్చుని ముందుకి వంగి నా కాలుకి ఉన్న కట్టుని వాసన చూశాడు.

"నిజంగా దెబ్బలేనండీ... ఊరికే బ్యాండేజీ కట్టుకోలేదు." అన్నాను నేను.

సందేహం తీరక మళ్ళీ ముందుకి వంగి వాసన చూశాడు. అయొడిన్ వాసన వస్తుందో లేదోనని.

సరిగ్గా అప్పుడే మా అకౌంటెంటు తలుపు తోసుకుని గదిలోకి వచ్చాడు.

ఆఫీసరు కంగారుగా తలెత్తి చూశాడు.

"అబ్బే...నేనేం కాళ్లు మొక్కడం లేదు...నాకేం అవసరం ఇతని కాళ్లు మొక్కడానికి. ఇతనేమైనా మినిష్టరు క్యాండిడేటా?... కాలుకున్న బేండేజీ వాసన్జూస్తున్నా... హిహిహి... అవును కదోయ్..." అన్నాడు నావంక చూస్తూ.

"అవునండీ..."

"నువ్వుకూడా వాసన్జూడు" అన్నాడు పైకిలేస్తూ అకౌంటెంటుతో.

"అబ్బే .... ఎందుకులెండి ... నిజం గానే దెబ్బలు తగిలినట్టున్నాయ్" అన్నాడు ఎకౌంటెంటు మొహమాటంతో.

ఆఫీసరు గుర్రుగా చూశాడు.

"ఊ...." అంటూ నా వైపుకి తిరి గాడు ఆఫీసర్. "ఇంతకీ నీకు యాక్సి డెంటు ఎలా జరిగిందోయ్?"


నేను నాకు జరిగిన యాక్సిడెంటు గురించి వివరంగా చెప్పసాగాను.

వాళ్ళు కళ్ళు ఇంతింత చేసుకుని వింటూ మధ్య మధ్యలో గుండెలమీద చెయ్యేసుకుని "అమ్మో...ఘోరప్రమాదం తప్పిందే ... ప్రాణం పోవల్సిందేనన్న మాట...బాగా తప్పించుకున్నావే..." అంటున్నారు.

వాళ్లు అలా వింటుంటె నాకు చాలా మూడ్ వచ్చింది. బాగా వర్ణించి చెప్పాను.

తరువాత నా సెక్షనుకి వెళ్ళి సీట్లో కూర్చున్నాను. సెక్షన్లోని జనం మొత్తం నా కట్లు చూశారు. వాళ్లు ఏమైందని అడి గారు.

నేను హీరో ఫోజుపెట్టి నేను స్పీడుగా స్కూటర్‌మీద వెళ్తుంటే ఎద్దు ఏ విధంగా అడ్డు వచ్చిందీ, నేను స్కూటర్‌మీంచి ఎలా దూకిందీ తరువాత లారీ మీదికివస్తే ఎలా జంప్ చేసిందీ, ఆ తరువాత నా మెళకువలన్నీ ఉపయోగించి ఆటోకి అందకుండా ఎలా దూకిందీ, చివరికి ఎద్దు పొడవడానికొస్తే మెరుపులా నా నడుం వెనక్కి వంచి పోటునుండి ఎలా తప్పించుకుందీ, వాళ్ళకి చెప్పాను. నేను కాబట్టి అలా తప్పించుకున్నానుగానీ వేరే



వాళ్ళయితే లారీకో, ఆటోకో, ఎద్దు కొమ్ముకో బలయిపోయి ఉండేవారని చెప్పాను.

వాళ్ళు నేను చెప్పేది అలా నోళ్ళు తెరుచుకుని వింటుంటే నాకు సరదాగా అనిపించింది.

ఆరోజు మొత్తం ఆఫీసులో స్టాఫ్‌కి నాకు జరిగిన యాక్సిడెంటు గురించి చెప్ప డంతో సరిపోయింది.

ఆఫీసునుండి బయటకు వచ్చాను.

బస్సుస్టాపులో జనం నా చేతులకీ, కాళ్ళకి ఉన్న కట్టు చూసి ఏమైందని అడి

గాను. వాళ్ళకీ చెప్పాను.

బస్సు ఎక్కిన తరువాత బస్సులో పరిచయం ఉన్న ఒకతని దృష్టిలో నా కట్లు కనబడ్డాయి.

ఆయనకీ చెప్పాను.

మా కాలనీలో బస్సుస్టాపులో దిగగానె అక్కడ ఒకళ్ళిద్దరు నన్ను చూసి ఏమైందని అడిగారు. వాళ్ళకి చెప్పేసరికి నాకు కాస్త సహనం చచ్చింది.

బస్సుస్టాపునుండి ఇంటికి వెళ్ళేదార్లో పలుకరైదురకి యాక్సిడెంటు గురించి చెప్పాల్సి వచ్చింది.

అందరికీ ఇలా చెప్పుకుంటూ వచ్చేసరికి దవడలు పీకుతున్నాయ్.

మర్నాడు మళ్ళీ అందరూ అడగడం మొదలైంది. ఇంటినుండి బస్సుస్టాండు కెళ్ళేదాకా అడిగిన వాళ్ళకి, బస్సు స్టాండులో అడిగినవాళ్ళకి, బస్సులో అడిగిన వాళ్ళకి, మళ్ళీ అక్కడ బస్సు దిగి ఆఫీసుకెళ్ళే దార్లో అడిగిన వాళ్ళకి అందరికీ యాక్సిడెంటు గురించి చెప్పాల్సి వచ్చింది.

ఆరోజు ఆఫీసులో క్రితంరోజు శెలవులో ఉన్నవాళ్ళు అడిగారు ఏమైందని. మళ్ళీ వాళ్ళందరికీ విపులంగా జరిగింది చెప్పాల్సి వచ్చింది.

క్రితంరోజు యాక్సిడెంటు గురించి చెప్పడంలో ఉన్న ఉత్సాహం ఆ రోజు లేదు. ఎవడైనా కట్టువంక చూసి అడిగితే చాలు గూబ పగలగొట్టాలనిపిస్తోంది.

పది నిముషాలకోసారి ఎవడో ఒకడు అడుగుతూనే ఉన్నాడు.

ఇంటికి వెళ్ళాక నాకోసం గుమ్మంలో చంద్రరావు ఎదురుచూస్తూ కనబడ్డాడు.

నాకు చిర్రెత్తుకొచ్చింది

"అడిగావంటే తంతా" అన్నాను రూమ్ తాళం తీస్తూ.

చంద్రరావు నవ్వాడు.

"ఎందుకురా అంతకోపం ... నేనేం డబ్బులు అప్పు ఇవ్వమని అడగడానికి రాలేదు...నీకు యాక్సిడెంటు అయ్యిందని ఎవరో చెప్తే చూద్దామని వచ్చాను ... అవునూ ఎలా అయ్యింది ? అన్నాడు కట్లవంక జాలిగా చూస్తూ.

నేను నిస్పృహతో కుప్పకూలిపోయాను.

వారం రోజులపాటు ఇలా నరక యాతన అనుభవించాను అందరికీ చెప్పలేక.

వారం తరువాత నా కట్లు విప్పేశారు. నేను తేలికగా ఊపిరి పీల్చుకున్నాను. ఇంక ఒంటిమీద కట్లు కనిపించవు కాబట్టి ఎవరూ యాక్సిడెంటు గురించి అడగరు.

కట్లు విప్పేశారు కాబట్టి ఆ రోజు ఆఫీసుకి స్కూటర్ మీద వెళ్ళాను.

నా సెక్షనులో పని చేసుకుంటుండగా నా దగ్గరికి పక్క డిపార్టుమెంట్లోని విశ్వనాథం వచ్చాడు.

"నేను పదిరోజులక్రితం ఊరెళ్ళాను. ఈవేళే జాయిన్ అయ్యాను. రాగానే చెప్పారు...నీకు పోయిన వారం యాక్సిడెంటయిందటగా ?... ఎలాగయింది ?" అని అడిగాడు.

నేను కోపంతో, బాధతో భయంకరంగా అరిచాను...

"ఈ........."

విశ్వనాథం తెల్లబోయాడు.

"పాపం... యాక్సిడెంటువల్ల మతి కాస్త స్థిరం తప్పినట్టుంది ..." అని గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు.


ఇంక ఆ రోజంతా ఆఫీసులో వారం రోజులుగా రానివాళ్ళు "నీకు యాక్సిడెంటయిందటగా మేం ఆఫీసులో లేనప్పుడు ఎలాగయింది" అని అడగడం మొదలు పెట్టారు. నాకు పిచ్చెక్కిపోయింది.

సాయంత్రం స్కూటర్మీద ఇంటి కెళ్తున్నాను.

వెధవలు ... నాకు యాక్సిడెంటయితేనేం...ఛస్తేనేం వీళ్ళకేందుకు ? ... ప్రతి ఒక్కడికీ వివరాలు కావాలి. ఆఫీసులో ఇంతసేపూ చంపుకు తిన్నారు. తరవాత ఇంటికెళ్ళాక కాలనీలో చంపుకు తింటారు .... బజార్లో ఎక్కడ బడితే అక్కడ తెలిసిన వాళ్ళందరూ అడుగుతారు ... ప్రాణాలు తీస్తారు ... ఛీ...

కోపంతో జుట్టుపీక్కున్నా స్కూటరు హాండిలు వదిలేసి...అలా రెండు క్షణాలే అంతే ....

ఎదురుగుండా లారీ దూసుకు వస్తోంది. మరో పక్కనుండి ఈసారి పంది అడ్డు వచ్చింది. గబుక్కున హాండిలు పట్టుకున్నా....బ్యాలెన్సు తప్పింది....



"క్రీ...ఈ....ష్...."

* * *

నేను మెల్లగా కళ్ళు తెరిచాను.

నేను ఆసుపత్రిలో బెడ్ మీద ఉన్నాను

నా చుట్టూ.......

నా పరిచయస్తులు, ఆఫీసుస్టాఫు, నా ముఖంలోకి ఆతృతగా చూస్తున్నారు.

యాక్సిడెంటు ఎలాగయిందో తెలుసుకుందామని....

---

రాజకీయాల్లో శత్రువర్గాలకు సంబంధించిన ఇద్దరు రాజకీయనాయకులకు ఎలాగైనా స్నేహం కలపాలని ఒక పెద్దమనిషి ప్రయత్నించాడు. ఇద్దర్నీ విందుకు ఆహ్వానించి ఒకరితో మరొకరు కలుపుగోలుతనంగా మాట్లాడమని ఆదేశించాడు.

"మీరు నాకు ఏం జరగాలని వాంఛిస్తున్నారో నేనూ మీకు అదే జరగాలని వాంఛిస్తున్నాను." అన్నా డొక నాయకుడు.

"చూశారా...మొదటి మాటలోనే మళ్ళీ శత్రుత్వాన్ని ఎలా వెళ్ళ కక్కుతున్నాడో! ఎంతెంత శాపాలు పెట్టేస్తున్నాడో!" అన్నాడు రెండో వ్యక్తి.